సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
ఆదివారం । 26 । నవంబర్ । 2023



**టమాట కిలో రూ.28**

కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.28 పలికింది. కనిష్టం రూ.10, సరాసరి రూ.18 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



**బతుకు బెట్టింగ్ పాలు**

జిల్లాలో క్రికెట్ మొదలు ఎన్నికల ఫలితాల దాకా బెట్టింగ్ సాగుతుండగా, అలవాటు పడిన ఎందరో యువకుల జీవితాలు రోడ్డున పడుతున్నాయి. 8లో

గరిష్టం/కనిష్టం
33.2°/ 21.3°

జిల్లాలో శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై ఒకట్రెండు ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసింది. ఉదయం చలి కొనసాగింది.

## న్యూస్‌రీల్

### 13 మండలాల్లో వర్షం



పుట్టపర్తి వద్ద వర్షం కురుస్తున్న దృశ్యం

**పుట్టపర్తి అర్బన్:** మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం ఉదయం వరకూ జిల్లాలోని 13 మండలాల్లో వర్షం కురిసింది. నల్లచెరువులో అత్యధికంగా 20.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అలాగే ఓడీ చెరువు 15.2, తనకల్లు 10.4, కదిరి 9.2, బత్తలపల్లి 8.2, గాండ్లపెంట 7.2, కనగానపల్లి 6.4, సీకేపల్లి 5.4, అమడగూరు 5.2, చిలమత్తూరు 3, పుట్టపర్తి 2.8 ముదిగుబ్బ, బుక్కపట్నం మండలాల్లో 1.8 మి.మీ మేర వర్షపాతం నమోదైంది. తాజా వర్షాలు రబీ పంటలకు మేలు చేస్తాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

### 28న జిల్లాకు ఎన్నికల రోల్ అబ్జర్వర్

**పుట్టపర్తి అర్బన్:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పరిశీలనలో భాగంగా ఎన్నికల రోల్ అబ్జర్వర్ మురళీధర్‌రెడ్డి ఈనెల 28న జిల్లాకు వస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు మధ్యాహ్నం 3 గంటలకు పుట్టపర్తికి రానున్న ఆయన.. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా జరుగుతున్న క్లెయిమ్‌ల పరిష్కారం, అభ్యంతరాల పరిశీలన ప్రక్రియను పరిశీలిస్తారని పేర్కొన్నారు.

### ఎస్కేయూ అభివృద్ధికి కృషి



బాధ్యతలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ వీసీ చింతా సుధాకర్

**అనంతపురం:** శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ) అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ చింతా సుధాకర్ అన్నారు. శనివారం ఆయన ఇన్‌చార్జ్ వీసీగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్లు, బోధనేతర ఉద్యోగులు, విద్యార్థులు, స్కాలర్లు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఇన్‌చార్జ్ వీసీ మాట్లాడుతూ యూనివర్సిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

### జేఎన్‌టీయూలో పదోన్నతులు



పదోన్నతి పొందిన వారితో వీసీ రంగజనార్దన

**అనంతపురం:** జేఎన్‌టీయూ అనంతపురంలో కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం (సీఏఎస్) కింద పదోన్నతులు కల్పించారు. వీసీ జింకా రంగజనార్దన ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ కే. మాధవి (సీఎస్‌ఈ), డాక్టర్ ఎస్. చంద్రమోహన్‌రెడ్డి (ఈసీఈ), డాక్టర్ ఆర్.రాజశేఖర్ (సీఎస్‌ఈ), డాక్టర్ బి.లలిత (సీఎస్‌ఈ) అసోసియేట్ నుంచి ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందారు. అలాగే డాక్టర్ ఎస్.అరుణా మస్తాని (ఈసీఈ), డాక్టర్ ఎస్.తాజ్ మహబూబ్ (ఈసీఈ), డాక్టర్ ఎ.దామోదర్‌రెడ్డి (మెకానికల్), డాక్టర్ ఎస్. రాధాకృష్ణ (సీఎస్‌ఈ), డాక్టర్ జి.మమత (ఈసీఈ), డాక్టర్ అరుణ (బయో టెక్నాలజీ), డాక్టర్ కె.అపర్ణ (ఈసీఈ), డాక్టర్ ఎస్.జఫ్రున్నీసా (డిప్యూటీ లైబ్రేరియన్)కు అసిస్టెంట్ నుంచి అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా వీరిని వీసీ జింకా రంగజనార్దన, రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్ అభినందించారు.

# పొదుపు.. ఆర్థిక మలుపు

స్వయం సహాయక సంఘాలు... మహిళల జీవితాల్లో వెలుగులు తెచ్చాయి. ఆర్థికంగా ఆదుకుంటూ కుటుంబాలను నిలబెట్టాయి. అందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ సంఘాలను మరింత బలోపేతం చేశారు. తాజాగా వాటిని మినీ బ్యాంకులుగా మార్చి పొదుపు మహిళలకు అత్యవసరంలో రుణాలు మంజూరు చేయిస్తున్నారు. దీంతో ఇటు సంఘాలకు, అటు సభ్యులకు ఎంతో మేలు జరుగుతోంది.



ప్రతి నెలా నిర్వహించే సమావేశంలో పొదుపు సంఘాల మహిళలు

**33,686**
జిల్లాలో స్వయం సహాయక సంఘాలు

**3,53,555**
ఆయా సంఘాల్లోని సభ్యులు

**రూ.4.26 కోట్లు**
సంఘాల నుంచి ప్రతి నెలా వసూలయ్యే పొదుపు

**రూ.263.54 కోట్లు**
ఇప్పటి వరకూ మహిళా సంఘాల పొదుపు మొత్తం

**రూ.59.75 కోట్లు**
పొదుపు ఖాతా నుంచి మహిళలు తీసుకున్న నగదు

- మినీ బ్యాంకులుగా పొదుపు సంఘాలు
- పొదుపు మొత్తాన్ని రుణంగా పొందే వెలుసుబాటు
- రూ.1 వడ్డీతో తిరిగి సంఘం ఖాతాకు జమ
- డ్వాక్రా మహిళలకు అదనపు ఆదాయం

**పుట్టపర్తి అర్బన్:** మహిళాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక చేయూత నిచ్చారు. దీంతో టీడీపీ హయాంలో డీలాపడ్డ సంఘాలు నేడు నెలవారీ కంతులు చెల్లిస్తూ బ్యాంకులకు నమ్మకంగా మారాయి. అందుకే రూ.10 లక్షల రుణమైనా క్షణం ఆలస్యంగా చేయకుండా బ్యాంకులు అందిస్తూ మహిళల ఆర్థిక ప్రగతికి తోడుగా నిలుస్తున్నాయి.

**ఆపత్కాలంలో ఆదుకుంటున్న సంఘాలు..**

గ్రామాల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న 10 మంది మహిళలు స్వయం సహాయక సంఘంగా ఏర్పడతారు. గతంలో ఒక్కో మహిళ రూ.100 చొప్పున పొదుపు చేసేవారు. ఇప్పుడు రూ.200 చేస్తున్నారు. ఆ మొత్తాన్ని బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తారు. ఇలా ప్రతి నెలా పొదుపు చేసిన మొత్తం ఏళ్లుగా బ్యాంకుల్లోనే నిల్వ ఉండి పోయింది. అయితే రెండేళ్ల క్రితం సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు నిబంధనలు సడలించారు. పొదుపు సంఘాలను మరింత బలోపేతం చేసే దిశగా అధికారులు అడుగులు వేశారు. పొదుపు ఖాతాల్లోని మొత్తాన్ని సంఘంలోని ఎవరికైనా అత్యవసరమనిపిస్తే కొంత మొత్తాన్ని రుణంగా ఇచ్చే దిశగా బ్యాంకులు ముందుకు వచ్చాయి. బ్యాంకు నుంచి తీసుకున్న మొత్తాన్ని తిరిగి వడ్డీతో కలిపి సభ్యులు కంతుల రూపంలో చెల్లించాల్సి ఉంటుంది.

**జిల్లాలో 3,53,555 మంది సభ్యులు..**

జిల్లాలో స్వయం సహాయక సంఘాలు 33,686 ఉండగా, అందులో 3,53,555 మంది సభ్యులుగా ఉన్నారు. ఆయా సంఘాల్లో సభ్యులంతా నెల నెలా పొదుపులో ఉంచిన నగదు రూ.263.54 కోట్లుగా ఉంది. ప్రస్తుతం ప్రతి నెలా మహిళా సంఘాల నుంచి రూ.4.26 కోట్లు పొదుపు రూపంలో వసూలవుతోంది. ఆయా పొదుపు ఖాతాల్లోంచి మహిళలు తిరిగి తీసుకున్న నగదు రూ.59.75 కోట్లుగా ఉంది.

**ఉమ్మడి నిధిలో జమ..**

రాష్ట్ర ప్రభుత్వం పొదుపు సంఘాలను మినీ బ్యాంకులుగా మార్చింది. దీంతో స్వయం సహాయక సంఘాలన్నీ ఆర్థికంగా బలపడేందుకు ఆస్కారం ఏర్పడింది. గతంలో ఒక సంఘం నుంచి పది మంది సభ్యులు తీసుకున్న రుణ మొత్తంపై వచ్చే వడ్డీని బ్యాంకు సేవింగ్స్ ఖాతాకే జమ చేసేవారు. ప్రస్తుతం సంఘంలోని సభ్యుల్లో ఎవరికైనా అత్యవసరమనిపిస్తే పొదుపులోని కొంత మొత్తాన్ని తీసుకొని తిరిగి రూ.1 వడ్డీతో కంతులు చెల్లించేలా అవకాశం కల్పించారు. ఇలా వచ్చే వడ్డీ అదనంగా సంఘానికి లాభం చేకూరుస్తుంది. రుణం తీసుకున్న సభ్యురాలికి రూ.1 వడ్డీ కావడంతో కొంత ఉపశమనం కలగనుంది. ఇలా జిల్లాలో ఇప్పటికే 59.75 కోట్ల రుణం మహిళలు తీసుకున్నారు.

### మినీ బ్యాంకు విధానం బాగుంది



స్వయం సహాయక సంఘాల బలోపేతం కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన మినీ బ్యాంకు విధానం చాలా బాగుంది. దీనివల్ల సంఘం సభ్యుల అవసరాలకు పొదుపు సొమ్ము నుంచి డబ్బు తీసుకొని రూపాయి వడ్డీతో చెల్లించడంతో ఎంతో మేలు జరుగుతుంది. ముఖ్యంగా వడ్డీ బాధలు తప్పుతాయి.

– కవిత, పుట్టపర్తి

### సంఘాలకు ప్రాణం పోశారు



గత ప్రభుత్వాల నిర్వాకంతో డ్వాక్రా సంఘాలు డీలా పడ్డాయి. డ్వాక్రా రుణమాఫీ, సున్నా వడ్డీ అమలు చేయక పోవడంతో సంఘాలన్నీ డిఫాల్టర్ జాబితాలో చేరాయి. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక డ్వాక్రా సంఘాలకు రుణ మాఫీ, సున్నా వడ్డీ, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేయడంతో ఆర్థికంగా బలోపేతమయ్యాయి. దీంతో సభ్యులకూ మేలు కలుగుతోంది.

– అరుణ, బ్రాహ్మణపల్లి

### 90 శాతం అప్పుగా ఇవ్వొచ్చు



స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకుల్లో పొదుపు చేసుకున్న మొత్తంలో 90 శాతం వరకూ తిరిగి వారికే రుణంగా ఇవ్వవచ్చు. రూపాయి వడ్డీతో తిరిగి బ్యాంకుకు చెల్లిస్తారు. దీనిపై ఎలాంటి ఆంక్షలు లేవు. ఈ విధానంపై ప్రభుత్వం ఇప్పటికే బ్యాంకర్లకు తగు సూచనలిచ్చింది.

– నరసయ్య, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ

### 'పాలిటెక్నిక్'కు జాతీయస్థాయి గుర్తింపు




విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి విక్టరీ సింబల్ చూపుతున్న కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు

**ధర్మవరం అర్బన్:** స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు జాతీయస్థాయి గుర్తింపు దక్కింది. అత్యుత్తమ సౌకర్యాలు, మెరుగైన బోధనతో నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) దక్కించుకుంది. ఈ మేరకు శనివారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు వివరాలు తెలిపారు. అత్యుత్తమ బోధన, మెరుగైన సౌకర్యాలు అందించే విద్యాసంస్థలను గుర్తించి ప్రోత్సహించేందుకు ఎన్‌బీఏ దేశ వ్యాప్తంగా కళాశాలలను, విద్యాసంస్థలను పరిశీలన చేస్తుంది. ఈ క్రమంలోనే అక్టోబర్ 13, 14, 15 తేదీల్లో న్యూఢిల్లీకి చెందిన త్రిసభ్య కమిటీ ధర్మవరం పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించింది. కళాశాల ప్రాంగణం, తరగతి గదులు, ల్యాబ్, నియామకాలు, బడ్జెట్ తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలించింది. పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశమైన త్రిసభ్య కమిటీ సభ్యులు కళాశాలలో సౌకర్యాలు, బోధన వివరాలను తెలుసుకున్నారు. తాజాగా కళాశాలలోని రెండు బ్రాంచ్‌లకు (ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్, కంప్యూటర్ ఇంజినీరింగ్) మూడేళ్ల పాటు అక్రిడిటేషన్ ఇచ్చింది. ఉపాధ్యాయులు, విద్యార్థుల సమష్టి కృషితోనే ఇది సాధ్యపడిందని కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి సంబరాలు చేసుకున్నారు.

### జీజీహెచ్, జీఎంసీలో పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

**అనంతపురం మెడికల్:** అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల (జీఎంసీ), సర్వజనాస్పత్రి (జీజీహెచ్)లో ఖాళీగా ఉన్న వివిధ పోస్టులను కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు పేర్కొన్నారు. దరఖాస్తును అనంతపురం వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈ నెల 27 నుంచి డిసెంబర్ 4వ తేదీలోపు దరఖాస్తులను ప్రభుత్వ వైద్య కళాశాలలో అందజేయాలని సూచించారు.

# ఆర్టీసీ.. ఆధ్యాత్మిక యాత్ర

- కార్తీక మాసంలో ప్రత్యేక సర్వీసులు
- ప్రయాణికులకు అందుబాటులో చార్జీలు
- తీర్థయాత్రలకూ బస్సులు
- ప్రైవేటు ట్రావెల్స్‌కు దీటుగా సేవలు




**పుట్టపర్తి టౌన్:** సురక్షిత ప్రయాణానికి చిరునామాగా మారిన ఆర్టీసీ...ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టు సర్వీసులు నడుపుతోంది. ముఖ్యంగా వివిధ పుణ్యక్షేత్రాలను దర్శించే వారి కోసం తక్కువ చార్జీలతోనే ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది. జిల్లా ప్రయాణికుల కోసం ఇప్పటికే ప్రతి నెలా అరుణాచలానికి ప్రతి డిపో నుంచి బస్సులు నడుపుతోంది. అలాగే ఇతర విహార, వివాహ, తీర్థ యాత్రలకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం అద్దె ప్రతిపాదన బస్సులు కేటాయిస్తోంది. నిర్దేశించిన ధర చెల్లిస్తే ఎంతదూరమైన అద్దె ప్రతిపాదన బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. ఇక ఈ కార్తీకంలో వివిధ పుణ్యక్షేత్రాలను దర్శించుకోవాలనే భక్తుల కోసం ప్రత్యేక సర్వీసులు అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రతి సోమవారం వివిధ శైవ క్షేత్రాలకు వెళ్లే భక్తులు సాధారణ టికెట్టు ధరకే ప్రత్యేక బస్సుల్లో ప్రయాణించేలా అవకాశం కల్పించారు.

**తీర్థ యాత్రలకు ప్రత్యేక సర్వీసులు..**

కార్తికమాసంలో పంచరామాల సందర్శించే భక్తులకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది. ప్రయాణికులు కావాలంటే అద్దె ప్రాతిపదికన కూడా సర్వీసులు అందుబాటులో ఉంచింది. లేదంటే ఆది, సోమ వారాల్లో మాత్రం రెగ్యులర్ టికెట్‌పై ప్రయాణించే అవకాశం కల్పిస్తోంది. ఈ కార్తీకంలో శ్రీశైలం, శబరిమల, షిర్డి, అరుణాచలం తదితర ప్రాంతాలకు బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

**ఒకేరోజు త్రిలింగ దర్శనం..**

ఆర్టీసీ కార్తీక మాసంలో శైవాలయాలను దర్శించుకోవాలనుకునే వారికోసం 'త్రిలింగ దర్శనం' ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది. ప్రతి సోమవారం జిల్లాలోని అన్ని డిపోల నుంచి ఉదయం 5 గంటలకు ప్రారంభమయ్యే ప్రత్యేక సర్వీసులు తాడిపత్రి వద్ద ఉన్న బుగ్గ రామలింగేశ్వరాలయం, నంద్యాల జిల్లా యాగంటి, మహానంది క్షేత్రాల దర్శనం అనంతరం తిరిగి ఆయా డిపోలకు చేరే విధంగా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. అలాగే గిరిప్రదర్శన కోసం అరుణాచలం వెళ్లే కోసం భక్తుల కోరిక మేరకు ప్రతి నెలా పౌర్ణమికి ముందురోజు సర్వీసు నడిపేవారు. ఈ కార్తీకంలో ప్రతి సోమవారం జిల్లాలోని అన్ని డిపోల నుంచి బస్సులు నడుపుతున్నారు. 40 మంది భక్తులు ఒక బృందంగా ఏర్పడితే ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నారు.

**కిలోమీటర్ ప్రాతిపదికనఅద్దె బస్సులు..**

దూర ప్రాంతాలకు వెళ్లే భక్తులు అద్దె ప్రతిపాదికన బస్సు బుక్ చేసుకుంటే రోజుకు 480 కిలోమీటర్లకు ధర చెల్లించాల్సి ఉంటుంది. అదనంగా జీఎస్టీ, టోల్‌గేట్లు, పార్కింగ్ ఫీజు ఉంటాయి.

**అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం..**

ప్రతి సర్వీసుకూ ఆర్టీసీ అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించింది. జిల్లాలోని అన్ని ఆర్టీసీ బస్టాండుల్లోని రిజర్వేషన్ కౌంటర్ల వద్ద, సమీపంలోని అథరైజ్డ్ ఏజెంట్ల వద్ద ముందే టికెట్లు బుక్ చేసుకోవచ్చు. లేదంటే www.apsrtconline.in వెబ్‌సైట్‌లోనూ టికెట్ బుక్ చేసుకునే అవకాశం ఉంది.

అద్దె ప్రాతిపాదికన బస్సులు ఇలా...

| బస్సు | సీట్ల సామర్థ్యం | కిలోమీటర్‌కు ధర |
|---|---|---|
| పల్లెవెలుగు | 56 | రూ. 52 |
| ఎక్స్‌ప్రెస్ | 50 | రూ. 62 |
| సూపర్‌లగ్జరీ | 36 | రూ. 57 |

### సాధారణ చార్జీలే



సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల కోసం, కార్తికమాసంలో వివిధ పుణ్యక్షేత్రాలను దర్శించాలనుకునే వారి కోసం ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నాం. గతంలో ప్రత్యేక సర్వీసుల్లో చార్జీలు అధికంగా ఉండేవి. ఇప్పుడు సాధారణ చార్జీతోనే ప్రత్యేక సర్వీసుల్లో ప్రయాణించే అవకాశం కల్పించాం. ప్రయాణికులు ప్రైవేటు ట్రావెల్స్‌ను ఆశ్రయించకుండా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలి.

– మధుసూదన్, జిల్లా ప్రజా రవాణాధికారి

# లక్ష్యంతో చదివితే బంగారు భవిత



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న అంబటి రాయుడు, ఆలూరి సాంబశివారెడ్డి

- ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు

**బుక్కరాయసముద్రం:** ఇంజినీరింగ్ విద్యార్థులు లక్ష్యంతో చదివితే బంగారు భవిష్యత్తు లభిస్తుందని ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు పేర్కొన్నారు. శనివారం రోటరీపురంలోని ఎస్ఆర్ఐటీ కళాశాలలో ఫ్రెషర్స్‌డే 'ప్రభవ–2023' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా మండల కేంద్రం బుక్కరాయసముద్రంలోని ముసలమ్మ కట్ట వద్ద అంబటి రాయుడు, ఏపీ ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరి సాంబశివారెడ్డి మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేశారు. అక్కడి నుంచి వైఎస్సార్‌సీపీ యువనేత ఆలూరి ఎర్రిస్వామిరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఆర్ఐటీ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాలలో జ్యోతి ప్రజ్వలన చేసి 'ఫ్రెషర్స్ డే' ప్రారంభించారు. ముఖ్య అతిథి అంబటి రాయుడు మాట్లాడుతూ అరచేతిలో లభించే టెక్నాలజీని విద్యార్థులు చదువుల కోసం ఉపయోగించుకుని కెరీర్‌పై దృష్టి పెట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు. 2019 వరకు 11 మెడికల్ కళాశాలలు ఉంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఈ నాలుగున్నరేళ్లలో 17 మెడికల్ కళాశాలలను కొత్తగా తీసుకొచ్చారన్నారు. గతంలో ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థుల ఫీజు రూ.50 వేలు ఉంటే రూ.35 వేల వరకు మాత్రమే సాయం అందేదన్నారు. ప్రస్తుతం జగనన్న విద్యా దీవెన పథకం కింద ఎంత ఫీజు ఉంటే అంత రీయింబర్స్‌మెంట్ ఇస్తున్నారన్నారు. జగనన్న వసతి దీవెన పథకం కింద మరో రూ.20వేల దాకా సాయం అందుతోందన్నారు. పేదింటి పిల్లలకు ఉన్నత విద్యను ఉచితంగా చదువుకునే అవకాశం కల్పించారన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో కష్టనష్టాలు ఉంటాయని, అంతమాత్రం చేత కుంగిపోరాదని అన్నారు. తాను కూడా క్రికెటర్‌గా రాణించడానికి ఎంతో కష్టపడ్డానని గుర్తు చేశారు. నచ్చిన రంగంలో నైపుణ్యాలు పెంపొందించుకోవాలని, ప్రణాళికాబద్ధంగా లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు.

**మంచికి పట్టం కట్టండి..**

రాష్ట్ర విభజనతో ఏపీకి చాలా అన్యాయం జరిగిందని, అభివృద్ధి ఫలాలు దక్కకుండా చేశారని అంబటి రాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ రాష్ట్రాభివృద్ధికి కలసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. తోటి వారికి సహాయపడే గుణం యువత అలవరచుకోవాలన్నారు. యువత తమ విలువైన ఓటుతో ప్రజలకు మంచి చేసే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని సూచించారు. సమాజంలో మార్పు తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. అనంతరం ఎంసెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా క్రికెట్ విజేతలకు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆలూరి రమణారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రంజిత్‌రెడ్డి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# 150 రోజుల 'ఉపాధి' కల్పిస్తాం

- డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయ్ ప్రసాద్

**ధర్మవరం రూరల్:** ఉపాధి హామీ జాబ్ కార్డు కల్గిన ప్రతి ఒక్కరికీ 150 రోజుల పనిదినాలు కల్పిస్తామని డ్వామా పీడీ విజయ్ ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన ధర్మవరం మండలం కొత్తకోట పంచాయతీలో జరుగుతున్న పంటకాలువల పూడిక తీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ధర్మవరం మండలాన్ని ప్రభుత్వం కరువు జాబితాలో చేర్చిందన్నారు. ఈ క్రమంలో ఉపాధి కూలీలందరికీ 150 రోజుల పనిదినాలు కల్పిస్తామన్నారు. పనులు లేవని ఏ ఒక్కరూ వలస వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. దినసరి వేతనం రూ.277 వచ్చే విధంగా పనులు చేసుకోవాలన్నారు. అదేవిధంగా పండ్లతోటలు సాగుచేసే రైతులకూ 'ఉపాధి'తో తగిన ప్రోత్సాహం అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఓ అనీల్‌కుమార్‌రెడ్డి, ఈసీ హరిబాబు, జేఈ నాగేంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్లు శివ, మురళీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బతుకు 'బెట్టింగ్'పాలు!



- ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువత ఆకర్షణ
- అధిక వడ్డీలకు అప్పు చేసి అవస్థలు

☛ ధర్మవరం పట్టణానికి చెందిన ఓ బ్యాంక్ ఉద్యోగి ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు బానిసై విచ్చల విడిగా అప్పులు చేశాడు. ప్రతినెలా వచ్చిన సంపాదనంతా బెట్టింగ్‌కే ఖర్చు పెడుతూ కుటుంబాన్ని నిర్లక్ష్యం చేశాడు. బెట్టింగ్‌లో డబ్బు నష్టపోవడంతో రుణదాతల ఒత్తిడి అధికమై ఏం చేయాలో దిక్కుతోచక అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. కుటుంబం దిక్కులేనిదైంది.

☛ బత్తలపల్లికి చెందిన రైతు చంద్రప్ప కుమారుడు ఓ ప్రైవేట్ కాలేజ్‌లో ఎంబీఏ చదువుతున్నాడు. ఇటీవల జరిగిన ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌లో బెట్టింగ్ ఆడి రూ.2 లక్షల దాకా పోగొట్టుకున్నాడు. అప్పు ఇచ్చిన వారు డబ్బు ఇవ్వమని ఒత్తిడి పెట్టడంతో అటు తండ్రికి చెప్పుకోలేక ఇటు అప్పు కట్టలేక బంధువుల ఇంటికి వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న తండ్రి కుమారుడ్ని పిలుచుకుని వచ్చి అప్పు కట్టాడు.

**ధర్మవరం:** బెట్టింగ్ యాప్‌లు కొంపముంచుతున్నాయి. అధిక వడ్డీలకు అప్పు చేసి పలువురు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. జిల్లాలోని వ్యాపార కేంద్రాలైన ధర్మవరం, పుట్టపర్తి, కదిరి, హిందూపురం, పెనుకొండ ప్రాంతాల్లో ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా బెట్టింగ్ ఎక్కువ జరుగుతోంది. విద్యార్థులు, ఉద్యోగాలు చేసే యువత ఎక్కువగా ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా బెట్టింగ్‌లు ఆడి సర్వస్వం పోగొట్టుకుంటున్నారు.

**ఆఫర్ల ఎర..**

ప్రస్తుతం ఆన్‌లైన్‌లో బెట్టింగ్ యాప్‌లు పది దాకా ఉన్నాయి. ఇవన్నీ చట్ట వ్యతిరేకంగా కార్యకలాపాలు సాగిస్తున్నవే. ముందుగా ఆఫర్లు ఇస్తూ ఆకట్టుకునే ఈ యాప్‌లు.. ఆ తర్వాత వారు మెల్లగా అలవాటు పడగానే ఉన్నదంతా పోగొట్టుకుని రోడ్డు మీద పడేలా చేస్తున్నాయి. చివరకు బాధితులు ప్రాణాలు కూడా తీసుకుంటున్నారు. ఇలాగే, ధర్మవరం పట్టణానికి చెందిన ఓ రెవెన్యూ ఉద్యోగి ఆన్‌లైన్ యాప్ ద్వారా క్రికెట్ బెట్టింగ్‌కు బానిసయ్యాడు. ప్రతినెలా వచ్చే జీతం మాత్రమే కాకుండా వడ్డీ వ్యాపారుల వద్ద నెలకు రూ.10కు అప్పు తెచ్చి మరీ జూదం ఆడి సర్వస్వం కోల్పోయాడు. చివరకు వడ్డీ వ్యాపారులు తీవ్రంగా వేధించడంతో జీవితం మీద విరక్తి చెంది రెండేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. ఇక.. ఇటీవల వరల్డ్ కప్ ఫైనల్‌మ్యాచ్ జరిగిన ఒక్కరోజే జిల్లా వ్యాప్తంగా రూ.20 కోట్లకు పైగా ఆన్‌లైన్ బెట్టింగ్ జరిగినట్లు సమాచారం.

**తెలంగాణ ఎన్నికలపై జోరుగా..**

డిసెంబర్ 30న జరగనున్న తెలంగాణ ఎన్నికలపై కూడా ఆఫ్‌లైన్ బెట్టింగ్ జోరుగా జరుగుతున్నట్లు తెలిసింది. ధర్మవరం నేసేపేట ప్రాంతంలోని వ్యాపారులకు తెలంగాణకు చెందిన వారితో వ్యాపారరీత్యా సంబంధాలు ఉండటంతో బెట్టింగ్ ఎక్కువ కాస్తున్నట్లు సమాచారం. వివిధ ప్రేవేట్ కంపెనీల సర్వేలు, జ్యోతిష్యుల అభిప్రాయాలు తీసుకుని మరీ బెట్టింగ్ కడుతున్నట్లు తెలిసింది. పోలీసులు పరిశీలించి, తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.

### బెట్టింగ్ మాఫియాపై ఉక్కుపాదం..



బెట్టింగ్ మాఫియాపై ఉక్కుపాదం మోపుతున్నాం. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి. బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులు తొలుత చిన్నపాటి లాభం చేకూర్చి ముగ్గులోకి దింపుతారు. ఆ తర్వాత నెమ్మదిగా అలవాటు పడేలా చేసి బానిసలను చేస్తారు. బెట్టింగ్ వల్ల కలిగే అనర్థాలను యువతకు, తల్లిదండ్రులకు వివరిస్తున్నాం. తల్లిదండ్రులు పిల్లలపై నిఘా ఉంచాలి.

– టి. శ్రీనివాసులు, డీఎస్పీ, ధర్మవరం

## క్లుప్తంగా

### మత్తు పదార్థాలను నియంత్రించాలి



మాట్లాడుతున్న డీఆర్‌ఓ కొండయ్య, ఏఎస్పీ విష్ణు

**పుట్టపర్తి అర్బన్:** జిల్లాలో మత్తు పదార్థాలను పూర్తిగా నియంత్రించాలని డీఆర్‌ఓ కొండయ్య, అడిషనల్ ఎస్పీ విష్ణు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మత్తు పదార్థాల నియంత్రణపై డీఆర్‌ఓ అధ్యక్షతన జిల్లా కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఫిర్యాదుల బాక్సులు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే మాదకద్రవ్యాల వినియోగంపై 14500 టోల్ ఫ్రీ నంబర్‌కు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్, అర్బన్ సీఐ కొండారెడ్డి, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, తదితరులున్నారు.

### స్టేషనరీ సరఫరాకు టెండర్లు

**ప్రశాంతి నిలయం:** జిల్లాలోని 2,824 అంగన్‌వాడీ కేంద్రాలు, రెండు బాలసదన్‌లు, ఐసీడీఎస్ పీడీ కార్యాలయం, శిశు అభివృద్ధి పథకం అధికారి కార్యాలయాలకు స్టేషనరీ సరఫరా చేసేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 27 నుంచి డిసెంబర్ 5 వరకూ టెండర్లు వేయవచ్చన్నారు. స్థానిక సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఎదురుగా ఉన్న ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారిత అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. డిసెంబర్ 6న కలెక్టర్ సమక్షంలో టెండర్లు తెరవనున్నట్లు వెల్లడించారు.



## బాలింత మృతి

- ప్రభుత్వ ఆస్పత్రి ముందు బంధువుల ధర్నా



ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

**గోరంట్ల:** బిడ్డకు జన్మనిచ్చిన రోజుల వ్యవధిలోనే బాలింత మృతి చెందిన ఘటన గోరంట్లలో చోటుచేసుకుంది. వైద్యుల నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందని ఆరోపిస్తూ మృతురాలి కుటుంబీకులు శనివారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ధర్నాకు దిగారు. వివరాలు.. గోరంట్లకు చెందిన అమ్‌జాద్‌బాషా కుమార్తె జబీనా (23)కు పురిటి నొప్పులు రావడంతో ఈనెల 16న స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన డాక్టర్ పావని హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. అయితే, స్థానికంగా ఉండే ఓ ప్రయివేటు ఆస్పత్రిలో స్కానింగ్ చేయిస్తే సాధారణ కాన్పు చేయడానికి ఎలాంటి ఇబ్బంది లేదని రిపోర్టు వచ్చినట్లు తెలిసింది. దీంతో అదే రోజు తిరిగి ఆమెను గోరంట్ల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఈ క్రమంలోనే రక్త స్రావం అధికమైంది. దీంతో హిందూపురం ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడ సైతం రక్త స్రావం అదుపు కాకపోవడంతో బెంగళూరు ఆస్పత్రికి తల్లిదండ్రులు తరలించారు. అక్కడి ఓ ఆస్పత్రిలో చికిత్స ఫలించక జబీనా బుధవారం మృతి చెందింది. గురువారం మృతదేహాన్ని గోరంట్ల తీసుకొచ్చి అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈ క్రమంలోనే, తమ బిడ్డ మృతికి డాక్టర్ పావని కారణమంటూ జబీనా తల్లిదండ్రులు, బంధువులు శనివారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ధర్నాకు దిగారు. ఘటనపై విచారణ జరిపి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకుంటామని ఆస్పత్రి వైద్యులు చెప్పడంతో వెనుదిరిగారు.

## 'ఫ్యామిలీ ఫిజీషియన్'తో మెరుగైన సేవలు



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి

**పుట్టపర్తి అర్బన్:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఫ్యామిలీ ఫిజీషియన్' కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయని జిల్లా వైద్యాధికారి ఎస్వీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం పుట్టపర్తి మండలం మార్లపల్లిలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీజనల్‌గా వచ్చే వ్యాధులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్సలు అందించి మందులను ఉచితంగా అందజేస్తారన్నారు. అవసరమైతే ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు పంపుతారన్నారు. 104 వాహనంలో స్కానింగ్, ఎక్స్‌రేలను ఉచితంగా తీస్తారని చెప్పారు. అనంతరం గ్రామంలో పలు వీధులను పరిశీలించారు. డ్రైడే తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి జ్యోత్స్న, సీహెచ్‌ఓ నగేష్, సూపర్ వైజర్ వెంకటరమణ, సిబ్బంది విజయ్ భాస్కర్, శివ, రాధ, మహేశ్వరి, రత్నమ్మ, లక్ష్మీపతి, మోహన్ తదితరులు ఉన్నారు.

## గుడిసెలోకి దూసుకెళ్లిన కారు



గుడిసెలో కారు



మురళి మృతదేహం

- ఒకరి మృతి, మరొకరి పరిస్థితి విషమం

**అగళి:** గుడిసెలోకి కారు దూసుకెళ్లిన ఘటన మండల పరిధిలోని కర్ణాటక సరిహద్దు ప్రాంతం కెంతర్లహట్టి గ్రామంలో శనివారం తెల్లవారుజామున జరిగింది. వివరాలు.. హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు కారులో మంగళూరు వెళ్తుండగా.. కెంతర్లహట్టి గ్రామం వద్ద వాహనం అదుపుతప్పింది. రోడ్డు పక్కన రెండు విద్యుత్ స్తంభాల్ని ఢీకొంది. ఈ క్రమంలోనే గుడిసెలోకి దూసుకెళ్లింది. అందులో నిద్రిస్తున్న చంద్రప్ప, ఆయన కుమారులు శ్రీరంగ, మురళిని గాయపరిచింది. తీవ్రగాయాలైన మురళి అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన చంద్రప్ప, శ్రీరంగను స్థానికులు తుమకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శ్రీరంగ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. శిర రూరల్ పోలీసుస్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఫిర్యాదుల పరిష్కారానికి కృషి

**పుట్టపర్తి టౌన్:** ప్రజల నుంచి అందిన వినతులు, ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేస్తామని డీపీటీఓ మధుసూదన్ తెలిపారు. పట్టణంలోని తన కార్యాలయంలో శనివారం ఆయన 'డయల్ యువర్ డీపీటీఓ' కార్యక్రమం నిర్వహించారు. అనంతపురం నుంచి పుట్టపర్తికి నూతన బస్సులు నడపాలని చింతల రమణ, గోపాల్ కోరారు. కొత్త బస్సులు కొనుగోలు చేసిన వెంటనే ఏర్పాటు చేస్తామని డీపీటీఓ తెలిపారు. మడకశిర నుంచి అనంతపురానికి ఉదయం 5.30కు బస్సు నడపాలని రాజశేఖర్ విజ్ఞప్తి చేయగా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కదిరి నుంచి కటారుపల్లి మీదుగా సాదువాండ్లపల్లికి సర్వీసు నడపాలని, పర్యాటక ప్రదేశాల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని కటారుపల్లికి చెందిన మధుసూదన్‌రెడ్డి, బాషాఖాన్ కోరారు. కదిరి నుంచి బెంగుళూరుకు వెళ్లే డ్రైవర్లు దేవనహళ్లి గ్రామంలోకి వెళ్లకుండా బైపాస్ నుంచే వెళ్లిపోతున్నారని సుధాకర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. అమడుగూరు నుంచి పుట్లపల్లి, తుమ్మల, బ్రాహ్మణపల్లి, ప్రాజెక్టు బత్తలపల్లి మీదుగా కదిరికి బస్సు నడపాలని తుమ్మకుంట పల్లి రెడ్డెప్పనాయుడు, రొద్దం మండలం దొడగట్ట నుంచి వెంకటాపురం గ్రామానికి ఓ సర్వీసు వచ్చేలా చూడాలని పలువురు విజ్ఞప్తి చేశారు. సమస్యలు విన్న డీపీటీఓ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

## బడ్జెట్ ప్రతిపాదనల్లో పారదర్శకత పాటించాలి

- సమగ్ర శిక్ష బడ్జెట్ రాష్ట్ర పరిశీలకులు సత్యనారాయణ

**అనంతపురం ఎడ్యుకేషన్:** పాఠశాల స్థాయి నుంచి ప్రాజెక్ట్ స్థాయి వరకూ రూపొందించనున్న బడ్జెట్ ప్రతిపాదనల్లో పారదర్శకత పాటించాలని సెక్టోరియల్ అధికారులకు సమగ్ర శిక్ష బడ్జెట్ రాష్ట్ర పరిశీలకులు సత్యనారాయణ సూచించారు. శనివారం బడ్జెట్ రూపకల్పనపై అనంతపురంలోని సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ కార్యాలయంలో సెక్టోరియల్ అధికారులతో ఆయన సమీక్షించారు. 2024–25, 2025–26 సంవత్సరాలకుగాను జిల్లా బడ్జెట్ ప్రణాళికను సిద్ధం చేసి రాష్ట్రస్థాయికి పంపాలన్నారు. సమావేశంలో ఏఎంఓ చంద్రశేఖరరెడ్డి, సీఎంఓ గోపాలకృష్ణ, అలెస్కో గోవిందరెడ్డి, జీసీడీఓ మహేశ్వరి, శ్రీసత్యసాయి జిల్లా ఐఈ కోఆర్డినేటర్ ఆనందబాబు తదితరులున్నారు.

**పాఠశాలల తనిఖీ**

**ముదిగుబ్బ:** మండలంలో ఎంఈఓ కార్యాలయం, బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, కేజీబీవీని శనివారం సమగ్ర శిక్ష బడ్జెట్ రాష్ట్ర పరిశీలకులు సత్యనారాయణ తనిఖీ చేశారు. గ్రామ సభలు నిర్వహించి తల్లిదండ్రులు, సర్పంచ్, ప్రజా ప్రతినిధుల సహకారంతో ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు.

## కోర్టును తప్పుదోవ పట్టించిన ఇద్దరిపై కేసు

**కదిరి టౌన్:** నకిలీ పత్రాలు, స్టాంపులను ఉపయోగించి కోర్టును తప్పుదోవ పట్టించిన నల్లచెరువు మండలం తిరుమల దేవరపల్లికి చెందిన వెంకటశివ, కుటాగుళ్ల బావయ్యపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. కిరణ్‌కుమార్ అనే వ్యక్తి కదిరి అడిషనల్ జ్యుడీషియల్ ఫస్టు క్లాసు మేజిస్ట్రేట్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఓ కేసులో నిందితులుగా ఉన్న వారు బెయిల్‌కు సంబంధించి అధికారుల సంతకాలు పెట్టి, దొంగగా స్టాంపులు వేసినట్లు గుర్తించామన్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## రత్నగిరిలో మళ్లీ గుప్త నిధుల వేట



బండరాళ్లను పెకిలించిన దృశ్యం

**రొళ్ల:** మండల పరిధిలోని రత్నగిరి సమీపంలో గుప్త నిధుల కోసం దుండగులు మళ్లీ తవ్వకాలు సాగించారు. పెద్ద పెద్ద బండరాళ్లను పెకిలించారు. శనివారం అటుగా వెళ్లిన కొందరు పర్యాటకులు ఫొటోలు తీసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. ఈ విషయంపై పలువురు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. దుండగులు రెచ్చిపోతున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

## జనవాక్కు

### ఉచితంగా మందులిచ్చారు



అక్టోబర్‌లో నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు'లో ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. జ్వరం, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న సమయంలో పైసా ఖర్చులేకుండా చికిత్స చేసి మందులు అందించారు. మందులు వాడడంతో ఆరోగ్యంగా ఉన్నా. చాలా సంతోషంగా ఉంది. ప్రజల ఆరోగ్యంపై సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక దృష్టి సారించడం హర్షణీయం. ఎంతో ఉన్నత ఆలోచనతో గ్రామ స్థాయిలోనే క్యాంపులు నిర్వహించడం గర్వకారణం. పేదలకు మేలు చేసిన సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– రామప్ప, ఉప్పిడిపల్లి, మడకశిర మండలం

### హాజరు శాతం పెరిగింది



ప్రభుత్వ చర్యలతో గతంలో కంటే ప్రభుత్వ బడుల్లో విద్యాబోధన మెరుగైంది. కార్పొరేట్ తరహాలో బడులను తీర్చిదిద్దారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. ట్యాబ్‌లతో విద్యాబోధన, ప్రాథమిక విద్యలోనే కంప్యూటర్ శిక్షణ, 'అమ్మ ఒడి' పథకం తదితరాలతో ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల హాజరు శాతం పెరిగింది. దీంతో చదువు చెప్పేందుకు ఉపాధ్యాయులు సైతం ఆసక్తి కనబరుస్తున్నారు. పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ బడులు గణనీయ పురోగతి సాధిస్తున్నాయి. విద్యా రంగంలో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు విద్యాభివృద్ధికి దోహదపడ్డాయి.

– ఎం.జాఫర్, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, అగళి మండలం

### ఇంటి వద్దకే పత్రాలు



కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం గతంలో తహసీల్దార్ కార్యాలయం వద్దకెళ్లి గంటల కొద్దీ నిరీక్షించేవాళ్లం. అత్యవసరమని ప్రాధేయపడినా పట్టించుకునేవారు కాదు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా మాకు అవసరమైన సర్టిఫికెట్లు ఇంటి వద్దనే పొందాం. ఒక్క రూపాయి కూడా ఖర్చు కాలేదు. దీంతో 'కాపు నేస్తం' పథకం ద్వారా ప్రభుత్వం నుంచి రూ.15 వేల ఆర్థికసాయం పొందా.

– వనజాక్షమ్మ, నరసంబూది, అగళి మండలం

## ఇంట్లో చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

**ఎన్‌పీకుంట:** మండల పరిధిలోని పెడబల్లికి చెందిన కె.తిరుపాల్‌శెట్టి ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. బాధితులు తెలిపిన మేరకు.. కె.తిరుపాల్‌శెట్టి తమ కుటుంబ సభ్యులతో కలిసి వైఎస్సార్ జిల్లాలోని వనిపెంట గ్రామంలో బంధువుల గృహప్రవేశ కార్యక్రమానికి వెళ్లారు. శనివారం మధ్యాహ్నం తిరిగి వచ్చారు. బీరువాలోని రూ.85,000 నగదు, 15 తులాల బంగారంతో పాటు 5.5 కేజీల వెండి, విలువైన పత్రాలు కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయగా క్లూస్ టీమ్ ఇంటి పరిసరాలు పరిశీలించింది.

## రేషన్ బియ్యం పట్టివేత

**పెనుకొండ రూరల్:** కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. సీఎస్‌డీటీ ప్రభావతి తెలిపిన మేరకు.. ముందస్తు సమాచారం మేరకు పెనుకొండ మండలంలోని పేటకుంట గ్రామంలో అధికారులు దాడులు నిర్వహించారు. ఓ ఆటోలో నిల్వ ఉంచిన 11 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సోమందేపల్లి మండలానికి చెందిన నందీష్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

**బొలెరో వాహనాల సీజ్**

**పెనుకొండ రూరల్:** అక్రమంగా డీజిల్ తరలిస్తున్న రెండు బొలెరో వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. ఎస్ఐ రమేష్ బాబు తెలిపిన మేరకు.. పెనుకొండ 44వ జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. డీజిల్ తరలిస్తున్న రెండు బొలేరోలను గుర్తించారు. సరైన ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు కేసు చేసి కమర్షియల్ ట్యాక్స్ ఆఫీస్‌కు బదిలీ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## నేటి నుంచి 'వికసిత్ భారత్'

**పుట్టపర్తి అర్బన్:** జిల్లాలో ఆదివారం నుంచి 'వికసిత్ భారత్' సంకల్ప యాత్ర చేపట్టనున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీక్ష అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఆదివారం పుట్టపర్తి మండలం బొంతలపల్లి పంచాయతీ, ధర్మవరం మండలం పోతుకుంట, కుణుతూరు పంచాయతీలు, పెనుకొండ మండలం గుట్టూరు, ఎర్రమంచి పంచాయతీలు, కదిరి మండలం ముత్యాల చెరువు, కొండమనాయనిపల్లి పంచాయతీల్లో యాత్ర సాగుతుందన్నారు. జేసీ చేతన్, ఇన్‌చార్జ్ డీపీఓ శివకుమారి తదితరులు పాల్గొన్నారు.